నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, గురువారం 5 డిసెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్ బాక్సులతో విద్యార్థులు

మధ్యాహ్న భోజనం బంద్

- రెండ్రోజులుగా విద్యార్థులకు అందని వైనం
- దోమలపెంట ప్రభుత్వ పాఠశాలలో ఆకలికేకలు

దోమలపెంట, డిసెంబర్ 4 : అమ్రాబాద్ మండలం దోమలపెంట ప్రభుత్వ పాఠశాలలో రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. భోజనానికి సంబంధించి ప్రతి నెలా 10 తేదీ వరకు బియ్యం తీసుకోవాల్సి ఉండగా.. హెచ్ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించి సకాలంలో తీసుకోలేదు. ఈ కారణంగా వంట ఏజెన్సీ వారు భోజనాన్ని చేయక పోవడంతో 51 మంది విద్యార్థులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో చేసేది లేక కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్లు తెచ్చుకుంటున్నారు. ఇంటి నుంచి భోజనాలు తెచ్చుకోవాలని హెచ్ఎం చెప్పడం గమనార్హం. దీనిపై డీఈవో, తాసీల్దార్ విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు రెగ్యులర్‌గా మధ్యాహ్న భోజనం అందించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. హెచ్ఎం నాగయ్యను వివరణ కోరగా.. నవంబర్‌కు సంబంధించి పాఠశాలకు బియ్యం రాకపోవడంతో రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం వండడం లేదని చెప్పారు.

నాగర్‌కర్నూల్‌లోని గురుకులంలో సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

ఉద్రిక్తంగా గురుకుల బాట

- నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ నేతల అడ్డగింత
- బీసీ గురుకులంలోకి అనుమతి లేదంటూ పోలీసుల వాగ్వాదం
- 30 మంది అరెస్ట్, పీఎస్‌కు తరలింపు

ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ కార్యకర్తలు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 4 : బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో చేపట్టిన గురుకులబాట ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ వద్ద ఉన్న బీసీ గురుకుల పాఠశాలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతుండగా.. ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు చేరుకొని అనుమతులు లేవంటూ నాయకులను అడ్డుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, వైస్ చైర్మన్ బాబురావు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ విష్ణుసాగర్‌తోపాటు కొందరు కార్యకర్తలను బలవంతంగా పాఠశాల గేటు బయటకు తోసేసి తాళం వేశారు. దీంతో పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. అనంతరం 30 మంది కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

భ్రష్టు పట్టిన గురుకుల విద్యావ్యవస్థ

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో గురుకుల విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ విష్ణుసాగర్ మండిపడ్డారు. సరైన భోజనాలు అందించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, కేసీఆర్ హయాంలో ఆదర్శంగా ఉన్న గురుకుల విద్యా వ్యవస్థను రేవంత్ సర్కారు నీరుగారుస్తున్నదని ధ్వజమెత్తారు. ఉయ్యాలవాడ గురుకులంలో ప్రిన్సిపాల్ అనుమతితోనే లోపలికి వెళ్లామని, అయినా పోలీసులు అనుమతి లేదంటూ బయటకు తోసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీఆర్ఎస్‌వీ విద్యావిభాగం ఆధ్వర్యంలో తాము గురుకులాల బాట చేపట్టామని తెలిపారు. పాఠశాలలో అంతా సక్కగుంటే పరిశీలించేందుకు వెళ్లిన తమను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. పాయసం సక్రమంగా లేదని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం చెప్పారన్నారు. మరుగుదొడ్లు, పరిసరాలు బాగా లేవని విద్యార్థులు చెబుతుంటే పోలీసులు మాట్లాడనివ్వ లేదన్నారు. ఉడికీ ఉడకని అన్నంతో.. రుచిలేని కూరగాయలతో విద్యార్థులు పస్తులుండేలా చేస్తున్నారన్నారు. ఏ ఒక్క మంత్రికి, ఎమ్మెల్యేలకు ఫుడ్ పాయిజన్‌పై అవగాహన లేకుండా ఉన్నారన్నారు. ఇక్కడి టీచర్లకు సైతం ఆరు నెలలైనా వేతనాలు లేవని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తేజా సురేందర్‌రెడ్డి, విజయమ్మ, సుమలత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- గురుకుల బాటలో జిల్లా ఇన్‌చార్జి కురువ పల్లయ్య

పుల్లూరులో విద్యార్థినులతో మాట్లాడుతున్న కురువ పల్లయ్య

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 4 : పేద విద్యార్థులు చదువుకునే గురుకులాలు, పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి కురువ పల్లయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో మూడో రోజు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకుల బాట కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉండవెల్లి మండలంలోని అలంపూర్‌చౌరస్తా, ఉండవెల్లి, కలుగొట్లలో ఉన్న గురుకులాలు, మైనార్టీ, కేజీబీవీను పరిశీలించి విద్యా, భోజనం, పాఠశాల సమస్యలపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కురువ పల్లయ్య మాట్లాడుతూ ఒకప్పుడు తల్లిదండ్రులు ప్రభుత్వ బడులకు పిల్లలను పంపాలంటేనే వెనుకడుగు వేసేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పేద విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో కార్పొరేట్‌కు దీటుగా సాంకేతికతతో కూడిన గురుకుల, మైనార్టీ, కస్తూర్బా, ప్రభుత్వ పాఠశాలలను నిర్మించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన్నప్పటి నుంచి విద్యార్థుల చదువులు, వారి బాగోగులను గాలికి వదిలేసిందని విమర్శించారు. విద్యా, భోజనంపై ప్రభుత్వం దృష్టి పెట్టక పోవడంతో ఎంతో మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురై దవాఖానల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఇంత నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్నా సీఎం మాత్రం పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గురుకులాలపై నిర్లక్ష్యం వీడి మౌలిక వసతులు కల్పించాలని లేని పక్షంలో విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్ బాబు, బీఆర్ఎస్వీ అయిజ మండలాధ్యక్షుడు మత్తలి, వీరేశ్, రాజు తదితరులున్నారు.

విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

అన్నంలో పురుగులు.. కుళ్లిన కూరగాయలు

- బాల కిష్టాపుర్ కేజీబీవీలో నాణ్యత లేని భోజనం
- గురుకులబాటలో వెల్లడైన నిజం

ఆత్మకూరు, డిసెంబర్ 4 : గురుకులాల్లో పేద విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు బీఆర్ఎస్వీ తలపెట్టిన గురుకులబాటలో చేదు నిజాలు బయటపడుతున్నాయి. అధ్వానంగా మారిన నిర్వహణతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు బహిర్గతమవుతున్నాయి. గురుకుల బాటలో భాగంగా బుధవారం బాలకిష్టాపుర్ కేజీబీవీని బీఆర్ఎస్వీ నాయకులు సందర్శించారు. వంట, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తుండగా పురుగులు బయటపడ్డాయి. శుచి, శుభ్రత లేని వంటగది, కుళ్లిన కూరగాయాలు నిల్వ ఉండడం, మురిగిపోయిన బీరకాయలు కనిపించాయి. వంటగది నిర్వహణ అధ్వానంగా ఉండడంతో నాయకులు అసహనం వ్యక్తం చేశారు. నిత్యం రుచిలేని భోజనంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై అధికారులను నిలదీసినా తప్పించుకునే సమాధానాలతో సర్ది చెప్పారు. దీంతో విద్యార్థులతో సమావేశమైన నాయకులు మీకు ఎలాంటి సమస్య వచ్చినా తమకు ఫోన్లు చేయాలంటూ చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఉండాలంటూ అధికారులను హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన గురుకులాలు కాంగ్రెస్ పాలనలో సమస్యలకు నిలయాలుగా మారాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి శివప్రసాద్‌యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రియాజ్, జిల్లా కోఆర్డినేటర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నంలో బయటపడ్డ పురుగులు, కుళ్లిన బీరకాయ

గుడ్లు తేలేస్తున్నారు..

- కొండెక్కిన కోడిగుడ్డు రేటు
- రికార్డు స్థాయిలో ధరలు
- హోల్‌సేల్ @ రూ.6.30, రిటైల్‌లో ఒక్కటి రూ.7
- 30 గుడ్లకు రూ.190
- రెండు వారాలుగా పెరుగుదల
- ట్రే గుడ్ల కంటే చికెన్ చీప్

గుడ్డు ధర వింటే గుండె గుబేల్ మనడం ఖాయం. పది రోజుల్లోనే డజన్ రేటు రూ.80కి చేరింది. ఆరేండ్లుగా పరిశీలిస్తే ఇవే రికార్డు స్థాయి ధరలు. హోల్‌సేల్ మార్కెట్‌లో 6 రూపాయల 30 పైసలుగా నెక్ నిర్ణయించగా.. ఇక రిటైల్ మార్కెట్‌లో రూ.7 వరకు ధర పలుకుతుంది. ట్రే(30 గుడ్లు)కు రూ.190 ధర ఉండగా.. ప్రస్తుతం కిలో చికెన్ రూ.162 (స్కిన్‌తో) ఉన్నది. ధర పెరగడంతో సామాన్యులపై, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీలపై భారం పడనున్నది. *- నాగర్‌కర్నూల్/నారాయణపేట, డిసెంబర్ 4*



కోడిగుడ్డు ధర రికార్డును సృష్టిస్తోంది. ప్రస్తుతం ఉన్న ధరలను చూస్తే రికార్డుస్థాయికి చేరిందని చెప్పొచ్చు. గతంలో ఎప్పుడూ ఇంత ధర పెరగలేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో సామాన్యులకు కోడిగుడ్డు దూరమవుతున్నది. ఇక గుడ్లు తినడం మూడు వారాలుగా మానుకున్నట్లేనని చెప్పవచ్చు. రోజుకు సగటున ఒక గుడ్డుకు 5 నుంచి 10 పైసల చొప్పున పెరుగుతూ వస్తున్నది. ఈ ఏడాది అక్టోబర్ చివరి వారంలో రూ.4.30 పలకగా.. నాలుగు వారాల వ్యవధిలో పెరుగుతూ హోల్‌సేల్‌గా రూ.6.30 చేరుకోగా, రిటైల్‌గా రూ.7కు చేరి రికార్డు సృష్టించింది. గుడ్ల ధరలు వింటేనే కనుగుడ్లు తేలేస్తున్నారు జిల్లా ప్రజలు.

రికార్డు స్థాయికి చేరిన ధరలు

గత ఆరేండ్ల ముందు నుంచి గుడ్డు ధరలను పరిశీలిస్తే ఇదే రికార్డుస్థాయి ధర అని చెప్పుకోవచ్చు. ఎన్నడూ లేనంతగా రిటైల్‌గా రూ.7కు అమ్మాల్సి వస్తుంది. గతేడాది ఇదే నెలలో 100 గుడ్లకు రూ.500 నుంచి రూ.550 వరకు పెరుగుతూ తగ్గుతూ ధర ఉండిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అప్పట్లో ఇదే రికార్డుస్థాయి ధర అని చెబుతున్నారు. కానీ ప్రస్తుతం ఆ ధరను తలదన్నే విధంగా గుడ్డు ధర రికార్డుస్థాయికి చేరి రూ.7 కు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సామాన్య ప్రజలు కోడిగుడ్డును కొనాలంటేనే తమ కనుగుడ్లు తేలేస్తున్నారు. జిల్లాలో వారం గుడ్ల ధరలను చూస్తే ఎప్పుడు ఇంతగా పెరిగలేదని చెప్పవచ్చు. 10 నుంచి 20 పైసలు పెరిగింది అంటే ఆ ధర కనీసం వారం రోజులైనా ఉండి పెరుగుతూ తగ్గుతూ ఉండేది. కానీ ప్రస్తుతం అదే వారం రోజుల్లో ఏకంగా రోజుకు 10 నుంచి 15 పైసల వరకు పెరుగుతూ హోల్‌సేల్ ధరనే గుడ్డు ఒక్కంటికి రూ.6.30 పైసల వరకు చేరుకుంది. దీనంతటికీ కారణం కోడిగుడ్ల ఉత్పత్తి సగానికిపైగా పడిపోయిందని హోల్‌సేల్ డీలర్లు పేర్కొంటున్నారు.

సామాన్యుడిపై గుడ్డు భారం

గుడ్ల ధరలు పెరిగి సామాన్యుడిపై పెను భారం పడింది. గుడ్డుతో పూట గడుస్తుందనుకునే ప్రజలు ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో హోల్‌సెల్ వ్యాపారులు ఆశ్చర్య పోయేలా ధరలు పెరగడంతో సామాన్యుల పరిస్థితి చెప్పనక్కరలేదు. ప్రస్తుతం పెరిగిన ధరలతో హోల్‌సెల్‌గా డజన్‌కు గుడ్లు రూ.75 నుంచి రూ.80కి లభిస్తున్నాయి. రిటైల్‌గా అయితే రూ.80 నుంచి రూ.84కు విక్రయాలు చేస్తున్నారు. ఈ ధరలను చూసి హోల్‌సేల్‌గా డజన్ గుడ్లను కొనగోలు చేసే సామాన్యుడు ప్రస్తుతం అరడజన్ గుడ్లతో సరిపెట్టుకుంటున్నాడు. ఉత్తరాది రాష్ట్రాల్లో చలితీవ్రత రోజురోజుకు పెరగడంతో అక్కడ డిమాండ్ పెరిగిందని హోల్‌సేల్ వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో గుడ్డు ధర మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఇది లాభపడగా స్థానికంగా ఫామ్ యజమానులు ధరల పెరుగుదలపై హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ సామాన్యుడిపై మాత్రం భారం పడిందని చెప్పవచ్చు. రోజు తినేవారు రెండు, మూడు రోజులకు ఒక సారి, వారానికి ఒక సారి గుడ్లు తినే పరిస్థితి దాపురించింది.

కారణాలు ఇవే..

ధరలు పెరగడంతో గుడ్డు కొనాలంటేనే సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారవర్గాల అంచనా. చలికాలంలో వీటి వినియోగం పెరగడం.. కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గడం వంటి కారణాలతోపాటు క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా కేకుల తయారీకి గుడ్లను అధికంగా వినియోగిస్తుండడం కారణంగా చెప్పొచ్చు. అంతేకాకుండా కోళ్ల దాణా రేటు, రవాణా ఖర్చులు సైతం ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయని పౌల్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో రూ.7 పలకగా.. తర్వాత కొద్దికొద్దిగా తగ్గుతూ రూ.5కు చేరాయి. మళ్లీ అక్కడి నుంచి ధరలు పెరుగుతూ రూ.7కి చేరాయి.

మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు అవస్థలే..

కోడిగుడ్డు ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులకు కష్టకాలంగా మారింది. పాఠశాలల్లో తెలంగాణ ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంలో భాగంగా వారానికి రెండుసార్లు భోజనంతోపాటు గుడ్డును అందించాలని సూచించింది. ఆ దిశగా వంటకార్మికులు వండి పెడుతున్నా, ప్రస్తుత గుడ్డు ధరలు పెరగడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 76 వేలకు పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు పెట్టాల్సి ఉన్నది. ధరలు అమాంతంగా పెరగడంతో ఏజెన్సీలకు వారానికి ఒక్కసారి కూడా పెట్టలేని పరిస్థితి నెలకొన్నది. దీంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గర్భిణులు, బాలింతలు, ఆరేండ్లలోపు పిల్లలకు సైతం అందించే గుడ్లలో అక్కడక్కడ కోత విధిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదేగాక గుడ్లను అందించే కాంట్రాక్టర్లు పూర్తిస్థాయిలో సరఫరా చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పుడూ లేనంతగా పెరిగిన ధరలతో పాఠశాలలో వంట కార్మికులు, అంగన్‌వాడీల్లో గుడ్లను ఏ విధంగా సరఫరా చేయాలనేది అర్థం కాని పరిస్థితి.

నిర్మానుష్యంగా ఉన్న రహదారి

ఏసీబీ రైడ్

- జల్లా పురం ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు
- అప్రమత్తమైన జిల్లా రవాణా శాఖ అధికారులు
- ఎవరి ఉద్యోగం పోతుందోనని ఆందోళన

గద్వాల అర్బన్/మానవపాడు, డిసెంబర్ 4 : మానవపాడు మండలంలోని జల్లాపురం వద్ద హైవేపై ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టును ఏసీబీ అధికారులు దాడులు చేశారు. మంగళవారం రాత్రి 8 నుంచి బుధవారం ఉదయం 11గంటల వరకు ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సీఐ లింగస్వామి, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య తనిఖీలు చేపట్టారు. ఏ ఎంవీఐ అధికారులు రమేశ్, అమృతవర్షిని, కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, హోంగార్డు గోవిందును విచారించినట్లు తెలిసింది. దాడులతో చెక్‌పోస్ట్ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. అయితే ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు రూ.29,000 లంచం వసూలు చేసినట్లు గుర్తించారు. అంతే కాకుండా చెక్‌పోస్టులోని కీలక పత్రాలను కూడా తనిఖీ చేయగా అందులో సరైన పత్రాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న అధికారులపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. ఈ వ్యవహారం చెక్‌పోస్టు వద్ద జరగడంతో జిల్లా రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. చెక్‌పోస్టు వద్ద ఉన్న అధికారులను ఏసీబీ అధికారులు ఆరా తీసిన సంగతి తెలుసుకొని మళ్లీ ఈ సారి జిల్లా రవాణా శాఖ కార్యాలయంపైనే దాడులు చేసే అవకాశం ఉందని గ్రహించారు. కార్యాలయ అధికారులు రోజు ప్రతి ఫైల్‌పై కొంత మొత్తంలో ధర నిర్ణయించి మామూలు వసూలు చేసే వారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం కార్యాలయానికి వచ్చిన ఫైల్‌పై ఏజెంట్లతో ఎలాంటి డబ్బులు వసూలు చేయలేదని తెలిసింది. ఏసీబీ అధికారులు తమపై నిఘా ఉంచారేమోనని కార్యాలయ అధికారులు గ్రహించి అప్రమత్తమైనట్లు కార్యాలయ ఆవరణలో గుసగుసలు వినిపించాయి. చెక్‌పోస్టు వద్ద చేసిన ఏసీబీ దాడుల్లో ఎవరి ఉద్యోగం పోతుందేమని రవాణాశాఖ అధికారులు ఇప్పటికే కొంత మంది అందోళన చెందుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు కొంత కాలంగా జిల్లా రవాణా శాఖ అధికారులపై నిఘా ఉంచినట్లు తెలిసింది.

జిల్లా నుంచి కొంత మంది ఫిర్యాదుదారులు ఏసీబీ అధికారులకు ఫోన్ ద్వారా జిల్లాలో రవాణాశాఖ కార్యాలయంలో మామూళ్లు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే జిల్లాపై నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు అవినీతి చేపలను పట్టేందుకు కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. అయితే చెక్‌పోస్టుపై తనిఖీ గురించి ఏసీబీ సీఐ లింగస్వామిని వివరణ కోరగా.. చెక్‌పోస్టును తనిఖీ చేశాం.. అక్కడ రూ. 29,000 గుర్తించాం.. చెక్‌పోస్టు దగ్గర పత్రాల వ్యవహారంలో సరిగ్గా లేదు.. ఈ విషయాలన్నింటిపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

కొండచిలువను పట్టుకున్న కలెక్టర్

మయూరీలో స్నేక్‌షో

మహబూబ్‌నగర్, డిసెంబర్ 4 : పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మయూరి ఎకో పార్కులో వనదర్శిని కార్యక్రమం, స్నేక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ వన్యప్రాణుల సంరక్షణ విషయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడం అభినందనీయమన్నారు. పర్యాటక ప్రదేశాలు సందర్శించి విజ్ఞానం పెంపొందించుకోవాలని, పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. బీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల జడ్చర్ల వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ సదాశివయ్య స్నేక్‌షో నిర్వహించారు. వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సత్యనారాయణ, డీపీఆర్‌వో శ్రీనివాస్, ప్లయింగ్ స్క్వాడ్, అటవీ శాఖ అధికారి రామ్మోహన్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజు, డీఈ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఇస్త్రా పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే సర్వే

- కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 4 : పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లిస్తేనే ప్రస్తుత సర్వే కొనసాగిస్తామని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 2 నుంచి లెప్రసీ సర్వే చేయాలని ఆశ కార్యకర్తలకు జిల్లా అధికారులు చెప్పడం, సర్వే కోసం ట్రైనింగ్ ఇవ్వడం ప్రారంభించారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఆపాలన్నారు. పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేస్తామని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ 2023లో సగం జిల్లాలకు.. 2024లో మిగతా జిల్లాలకు డబ్బులు పంపిణీ చేసినా.. అధికారుల నిర్లక్ష్యంతో ఆశలకు అందలేదన్నారు. కమిషనర్ ఆఫీస్‌లో సంబంధిత అధికారులను కలిస్తే సర్వే డబ్బులు విడుదల చేసి చాలాకాలం అయ్యిందని చెప్పినా నేటికీ అందలేదని వాపోయారు. అనంతరం అదనపు డీఎంహెచ్‌వో వెంకటబాసుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, కోశాధికారి అశోక్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి, ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ, ఉపాధ్యక్షురాలు స్వప్న, శ్రీదేవి, వసుంధర, నర్మద, యూనియన్ నాయకురాలు కృష్ణవేణి, భాగ్యమ్మ, వెంకటమ్మ, శకుంతల, సువర్ణ, మానస, లక్ష్మి, చంద్రకళ, మాణిక్యమ్మ, మమత, నర్మద, శోభ, కృష్ణవేణి, శ్రీదేవి, అమీనా పాల్గొన్నారు.

అదనపు డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు